



# అన్నంగుడ్డ

సుంకోజి దేవేంద్రాచారి

ఆకాశం మూడురోజుల నుంచి మబ్బులతో నిండి వుంది. వీధిలోకి వచ్చి ఆకాశం వైపు చూశాడు ఆచారి. సూర్యుడు కన్పించకపోవడంతో టైము ఎంతయిందో అర్థం కాలేదతనికి.

"పొద్దుతో పనేముండాది. తినేసి ఎలబారుదురు రాండి," అంటూ లోపల నుంచి పిలచింది ఆచారి భార్య.

"సోమవారం గదా. ఏడున్నర నుంచి తొమ్మిద్దాంకా రావుకాలం. ఆయుధాలతో పని. రావుకాలం చూడకుండా పోయినామంటే కాళ్లూ చేతులూ తెగ తాయి," అన్నాడు వీధిలో నుంచే.

"రావుకాలాలు, మంచిరోజులు - అన్నీ పాటించే మన బతుకులు ఈడికుండాయి," అని గొణుక్కుంటూ తన పనిలో మునిగిపోయింది.

"పద్దన్నే ఏందే వదరతాండావు. మొబ్బుతోనే లేసి అన్నంకూర చేసేసింటే ఈపాటికి ఎలబారి పోయిందుము కదా," అన్నాడు ఆచారి కోపంగా లోపలకు వచ్చి.

"తెల్లారక ముందే అన్నంకూర అయిపోయింది," అందామె, నీదే ఆలస్యం అన్నట్లుగా. దానికి ఆచారి "అన్నం కూర చెయ్యడమనుకొన్నేవా నా పని. రంపం రాయద్దా. బాడిశ నూరుకోవద్దా. బుడ్డి (దీపం) పెట్టుకోనైనా నీ పని చేసుకోవచ్చు. నాపని అట్ల కాదుగదా," అన్నాడు తన ఆలస్యాన్ని సమర్థించుకుంటున్నట్టుగా.

"టైము ఎనిమిదిన్నరంట నాయనా'," అంటూ వచ్చాడు ఇరవై రెండు సంవత్సరాల కొడుకు.

"అంతయిందా. మోడంలో పొద్దే తెల్లా. బిన్నే పెట్టే. అన్నం తినేసి ఎలబారేలకు సరిపోతాది," అన్నాడు ఆచారి.

ఆమె రెండు పీటలు వేసింది. నీళ్లగ్లాసులు, అన్నం కంచాలు పెట్టింది. అన్నంలోకి చింతపండు ఊరిమిండి వేసింది.

తండ్రీకొడుకులు పీటల మీద కూర్చొని తిన సాగారు.

ఆచారి భార్య దండెం మీద వేలాడుతున్న అన్నం గుడ్డను చేతికి తీసుకొంది. దానిని నీళ్లతో తడిపింది. చాప పరిచి, దానిమీద అన్నం గుడ్డనుంచింది. వెడల్పు పాత్రలో చల్లారబెట్టిన అన్నాన్ని తీసి గుడ్డలో వేసింది. అన్నం మధ్యలో చింతపండు ఉరిమిండి వేసి, గుడ్డ నాలుగు చెరుగులను జాగ్రత్తగా ఒకచోటకు చేర్చింది. ఒక చెరగును మిగిలిన మూడు చెరగుల చుట్టూ తిప్పి ముడివేసింది. అన్నంమూటను చేతిసంచిలో ఉంచింది.

అన్నం తింటున్నా, భార్య చేస్తున్న పనిని తదేకంగా చూస్తూనే ఉన్నాడు ఆచారి. తమ పెళ్లయి ముప్పయి సంవత్సరాలయింది. పెళ్లయినప్పటి నుంచి ఒక క్యారేజీ తేవాలని, అన్నంగుడ్డకు బదులు పనికి క్యారేజీని తీసుకొనిపోవాలని అనుకుంటున్నాడు. కట్టుకునే రెండు పంచెల్లో ఒకటి చిరిగిందాకా ఇంకొకటి కొనలేడు. ఆ చిరిగిన పంచె అన్నంగుడ్డగా మారుతోంది. రానురాను అతనికి క్యారేజీ మీద కోరిక నశించి, అన్నంగుడ్డ మీద మమకారం పెరిగింది.

తండ్రీ కొడుకులు అన్నం తినడం పూర్తయింది. ఆచారి భార్య వచ్చి చేతిసంచిని కొడుకు చేతికిచ్చింది. సురేంద్ర సంచి లోపలకు పరిశీలనగా చూశాడు. అన్నం

మూట, ఆకురాయి, దారం, గజంటేపు కనిపించాయి. సంతృప్తిగా తలాడించాడు. పెద్ద బాడిశెను భుజం మీద ఉంచుకొన్నేడు. 'పోయొస్తాం,' అన్నట్లుగా తల్లివైపు చూశాడు.

''సందేళ 'బత్తెం' అడుగు. ఏరోజుకు ఆరోజు ఇచ్చెయ్యమను. బత్తెం ఒకసారిగా ఇస్తామంటారు. కడాన వాళ్లకు మనసొప్పదు,'' అంది ఆమె.

''సరేమ్మా,'' అన్నాడు సురేంద్ర.

''వోళ్ల బాయిగడ్డన మునగమాన్లు చానా వుండాయి. వచ్చేటప్పుడు మునగాకు పెరుక్కోని రాండి,'' అంది.

''సరే సరే... అయ్యన్నీ నువ్వు చెప్పాల్నా. ఎదుర్రా,'' అంటూ ఆచారి రంపం ఎత్తుకొని భుజం మీద పెట్టుకొన్నేడు.

పొయ్యేన పని కానీ కాకపోనీ, భార్య ఎదురువస్తే తప్ప ఇంటి నుంచి కదలడు ఆచారి. తమ పెళ్లయిన ప్పటి నుంచి ఆ అలవాటు అలా కొనసాగుతూనే వుంది. తండ్రీకొడుకులు ఒకరి వెనుక ఒకరు నడవసాగారు.

''యాడికి ఆచారి. అబ్బా కొడుకు పోతాండారే?''

''నీకు ఎన్నిసార్లు రమణా చెప్పేది. పనికి పొయ్యే టప్పుడు 'యాడికి' అని అడగద్దని,'' అన్నాడు ఆచారి కాస్త కోపంగా.

''అంత కోపమయితే ఎట్ల ఆచారి?'' అంటూ వెళ్లిపోయాడతను.

''ఎన్ని రోజులుంటాది నాయనా పని,'' అడిగాడు సురేంద్ర.

''నెలరోజుల పైన్నే ఉంటాది. ఇంతకు ముందొక సారి... అప్పుడు మీరు చిన్నబిడ్డలు. మీ అమ్మా నేనూ వారం రోజుల పని అని పొయ్యినాము. ఆడే రెండు నెలలు పని దొరికింది. ఒకర్ని చూసి ఒకరు పని చేయించుకుంటారు,'' అన్నాడు హుషారుగా ఆచారి. ఇంకా ఏదో మాట్లాడాలని అనుకున్నాడు. కొడుకు కూడా తండ్రిని ఏదో అడగాలనుకున్నాడు. బుర్రుమనే శబ్దం రావడంతో ఇద్దరూ తలలు తిప్పి చూశారు. ట్రాక్టరు జోరుగా పోతోంది. ట్రాక్టరును చూడగానే ఇద్దరూ స్తబ్దుగా అయిపోయినారు.

ముందురోజు రాత్రి రెండు పదున్ల వాన అర గంటలోనే కురిసింది. ఆ వానకు రైతులందరూ దుక్కిలు చేయడం మొదలుపెట్టినారు. ఐదు సంవ త్సరాలకు ముందయితే ఆచారి మాత్రం వానకు చాలా సంతోషించేవాడు. ఇప్పుడు తనకా వానతో ఎలాంటి సంబంధం లేనట్లుగా నిర్లిప్తంగా ఉన్నాడు.

''ట్రాక్టరొచ్చి మన కడుపులు కొట్టినె,'' అన్నాడు ఆచారి.

సురేంద్ర ఏం మాట్లాడకుండా మౌనంగా నడవ సాగాడు. ఆ ట్రాక్టరు కంభిరెడ్డిది. తమ ఊరంతటికీ కలిపి అదొక్కటే. ఇట్లాంటి సమయాల్లో పెదినేకాలవ పల్లె రమణ, ఎజ్జేనపల్లె సిద్ధారెడ్డిలు కూడా ట్రాక్టర్లు తీసుకొచ్చి దున్నుతాంటారు. ఆ మూడు ట్రాక్టర్లూ పల్లెకు మూడు పక్కలా దున్నుతున్నాయి. రైతులంతా బెల్లం చుట్టూ మూగిన ఈగల మాదిర్తో ఉండారు. రాత్రీ పగలూ తేడా లేకుండా వాటి వెంట తిరిగి తమ తమ పొలాలు దున్నించుకొంటా ఉండారు. ట్రాక్టర్‌ను చూస్తుంటే ఈమధ్య ఆచారికి విపరీతమయిన కోపం వస్తాంది. దాని మూలంగా తమకూ, రైతులకూ ఉండే ఒక సంబంధం 'మడకలు' చెక్కడం పూర్తిగా లేకుండా పోయింది. తమకు బతుకుతెరువూ లేకుండాపోయింది.

పది సంవత్సరాల ముందు, తొలి ముంగార్లనాటి ఒకరోజు గుర్తొచ్చింది ఆచారికి.

చింతచెట్టు కింద రైతులు చాలామంది గుమి గూడినారు. చింతచెట్టు మొదులుకు దాదాపు ఇరవైకి మడకతుండ్లు ఆనుకొని ఉండాయి. చింతచెట్టు వేరొ కటి వర్షాలకు మట్టి కొట్టుకొని పోవడంతో జానడెత్తు భూమి పైకి ఉంది. దానికి మడకకొయ్యను ఆనించి పెద్ద బాడిశతో చెక్కు తున్నాడు ఆచారి. ఆచారి భార్య దానిని కదలకుండా పట్టుకోనుంది. ఆకాశం మేఘా వృతమై ఉంది. చల్లటి గాలులు వీస్తున్నాయి. అంత చల్లగాలిలో కూడా ఆచారి శరీరం నిండా చెమటలు.

చెక్కడం ఆపి, ''నీళ్లు తేపో... దప్పికగా వుండాది,'' అన్నాడు భార్యతో. ఆమె లేచి ఇంటికి వెళ్లింది.

''నేను పట్టుకొంటాను. చెక్కున్నా,'' అంటూ వచ్చాడు క్రిష్ణారెడ్డి.

''నేనూ మనిషినేప్పా. ఇంగా మద్దేన్నంగాలా. అప్పుడే ఐదు మడకలు చెక్కేసినా. ప్రాణాలన్నీ ఉగ్గ బట్టి చెక్కతాండా బిన్నే అయిపోవాలని. కొంచేపుండు. నీళ్లు తాగనీ, మీరందరూ ముందుగా చెక్కించుకుంటే నేమి? వానలు పన్నెప్పుడు వచ్చేది. గొంతు మింద కుచ్చొనేది,'' అన్నాడు ఆచారి.

''మాదయిందా ఆచారి,'' అంటూ వచ్చాడు కొండ్రెడ్డి.

''ఇంకా కాలా మామా. ఇది చెక్కేసినానంటే, అన్నం తినేసి కుచ్చొంటా. ముందుగా మీ మడక్కే మేడి. నగ ఏసిస్తాలే. 'కారు' అంపతానంటివి. అంపలేదే.''

''మా కొడుకుక్కు చెప్పేసి వచ్చినా, ఎత్తుకో నొస్తాడు.''

''అక్కొచ్చింది. నీళ్లు తాగున్నా చెక్కుదువు,'' అన్నాడు క్రిష్ణారెడ్డి.

''పనులప్పుడు అరువులు పెట్టుకొన్నేవా ఆచారి,'' అన్నాడు నారాయణ.

''నాకంత తీరిగ్గాడానా,'' అంటూ భార్య చేతి లోని చెంబు తీసుకొని నీళ్లు గటగటా తాగేసినాడు. తిరిగి పెద్ద బాడిశను చేతికి తీసుకొన్నాడు. క్రిష్ణారెడ్డి మడకను పట్టుకొన్నాడు. ఆచారి భార్య చెక్కిన పేళ్లన్నీ తీసి గంపలో వేయసాగింది.

''అక్కో... పేళ్లు మాయ్యిగదా,'' అన్నాడు క్రిష్ణా రెడ్డి.

''ఒకసారి, ఇప్పుడు మాటగాదులే. మా పెద్దయ్య తాత బతికున్నెప్పటి మాట. శెట్టి ఒగ మడకతుండు తీస కచ్చినాడంట. దాంతోపాటు గంప కూడా తెచ్చుకొన్నే డంట. ఎందుకు శెట్టీ గంప, అంటే పేళ్లకు అన్నేడంట. సరే పట్టుకో అని మా తాత బాడిశ తీసుకొని చెక్కడం మొదలు పెట్టినాడంట. అట్ల తిప్పు, ఇట్ల తిప్పు అంటా మొత్తం పేళ్లుగా చెక్కేసినాడంట. ఇదేంది ఆచారి మడక చెక్కమంటే మొత్తం పేళ్లు చెక్కసినావే అని శెట్టంటే, నువ్వేగదా పేళ్లు కావాలన్నేవు అన్నాడంట మా తాత,'' అన్నాడు ఆచారి చేస్తున్న పనిని ఆపకుండానే.

ఆ మాటలకు అక్కడున్న రైతులంతా పకపకా నవ్వినారు.

''నువ్వీకత చెప్పావనే, నేనా మాటనింది. మాకేం పేళ్లు వద్దులే. మడక బాగుంటే చాలు,'' అన్నాడు క్రిష్ణారెడ్డి కూడా నవ్వుతూ.

చుట్టుపక్కల నాలుగైదూర్లలో మరో ఆచారి లేడు. దానివలన తొలిముంగార్ల వానలప్పుడు ఆచారి అవసరం చాలా ఎక్కువ రైతులకు. మడకకు పదిశేర్ల వడ్లు, డబ్బా శనగకాయలు ఇచ్చే వాళ్లు. వారం రెండు వారాలు కష్టపడితే దాదాపు ఆరునెలల తిండిగింజలు ఇంట్లోకి వస్తా ఉండేటియి. మిగిలిన రోజుల్లో ఆలూ మగలు చెక్కలు తీర్లు కొయ్యడానికి పొయ్యేవాళ్లు.

''ఏంబా ఆచారి... యాన్నో పని దొరికినట్టుందే,'' అంటున్న రామచంద్ర మాటలతో ఆచారి ఆలోచన్ల నుంచి తేరుకున్నాడు.

''చింతమాకల పల్లెలో దాలమంద్రం తీర్లు, పలకలు కొయ్యాలన్నా. నాకు వాళ్లు చెప్పి సమచ్చరం పైనయింది. కోపించేసినారేమో అనుకోనుంటి. నిన్న కమ్మారపల్లెలో రోడ్డుమింద నిల్చుకోనుంటే, ఆసామి బస్సులో పోతాండి 'ఆచారీ... ఇంటికాడికొచ్చి అయ్యి కొసెయ్యగూడదా'అని అరిసి చెప్పె. అందుకే ఈ పొద్దు ఎలబారినాం,'' అన్నాడు ఆచారి.

''అయినా ఇప్పుడు ఎవరు కోపిస్తాండారు మీ దగ్గర. ట్రాక్టర్లొచ్చి, పీలేరు కలకడలో కోతమిషన్లు పడే లకు అందరూ ఆడికే పోతాండారే.''

''అవున్నా. ఎక్కువగా ఉండేవోళ్లు ఏసుకోని పోతాండారు. ఈ వానలు సరిగా పడేదిలేదు. రైతులకు పంటల్లేవు కదా. రైతుల చేతల్లో దుడ్డాడతాంటే మా దగ్గిర పని చేపిస్తారు. ఎవురేగాని పలానా పని చెయ్యి ఆచారి అని పిల్చి చెప్పేవోళ్లే లేరున్నా.''

''నిజమే. వానలు పన్నే పడకపోయినా, పను లున్నే లేకపోయినా నీ బతుకంటే ఏందో అయిపోతాం దనుకో. నీ కొడుకు బతుకు ఎట్లా? బాగా చదువుకో నున్నింటే ఉద్యోగమన్నా వచ్చిన్నేమో. అయినా ఈ కాలం ఎంత చదివినా యాడ ఉద్యోగాలొస్తాండాయి. చేతి పనులే మేలు. సేద్యం, చదువు కన్న! నువ్వు ఈ పల్లెను పట్టు కొని ఎందుకు ఏలాడతావు. ఏదన్నా టౌను చేరగూడదా,'' అన్నాడు రామచంద్ర.

ఆచారి మౌనంగా తలూపాడు.

''నాయనా తీరిగ్గా సందేళ మాట్లాడుకోవచ్చు. పోదాంరా. పొద్దు పోతాండ్లా,'' అన్నాడు సురేంద్ర.

''పొండి పొండి... నాగ్గూడా పనుండాది,'' అంటూ వెళ్లిపోయాడతను.

ఇద్దరూ నడవసాగారు. ఆచారి మొదలుపెట్టాడు.

''పదైదేండ్ల ముందుమాట. అప్పుడు నువ్వూ, మీ అక్కా చదువుకుంటాంటిరి. మనకు దగ్గిర్లో బడి యాడుండాది? కమ్మారపల్లెలో ఏడు దాంకానే గదా ఉండాది. ఏడు పైన చదవాలంటే నారమాకలపల్లో, చీనేపల్లో పోవాల. అందూరం బిడ్డలను యాడలే పంపే దని, పీలేరుకు చేరుకోవాలనుకొంటిమి. ఆడయితే ఏదన్నా పని చేసుకొని బతకతా, మీ ఇద్దర్నీ చదివిపీయా లనుకొంటిమి. ఊరొదిలి పోతామంటే ఊర్లో రైతులంతా అరకీస్ పోనే గూడదనిరి. 'మాకు నువ్వు తప్ప ఇంగెవ రుండారు? నీకూ, నీ బిడ్డలకు ఏ లోటూ రాకుండా చూసుకొంటాం గదా,' అని చానా బంగపోయిరి. ఇప్పుడు మాట్లాడినాడే, ఈయనే అప్పుడు పొయ్యేదానికి ఒప్పుకోంది. దుడ్డు గావాలంటే ఇస్తాం, నీ బిడ్డలు చదివేటిగా ఉంటే ఆస్టల్లో చేరిపిస్తా, ఎకరా రెండెకరాల చేను, పదిరవై కుంటల మడి చెప్తా చేసుకో. ఈ ఊరు

మాత్రం వదిలిపోవద్దు అన్నోడు ఇప్పుడు ఏదన్నా టౌనుకన్నా పోగూడదా అంటాండు,'' అన్నాడు ఆచారి బాధగా.

సురేంద్ర తండ్రి మాటలకు ఊకొట్టలేదు. ఔనన లేదు. కాదనలేదు. ముభావంగా నడుస్తున్నాడు. ఆచారి లో మాత్రం మాటలు ప్రవాహంలా రాసాగాయి.

''అప్పుడే పొయ్యున్నే బాగుండు. గుర్రం సాయి బోళ్లు పీలేరుకు పొయ్యి టీ అంగడి పెట్టుకొని బాగా సంపాదించినారు. అప్పుడే గన పొయ్యుంటే మీ అమ్మ ఇంటికాడ ఇడ్లీలు, దోసెలు అమ్మినా, నేను యాడన్నా కొయ్యల మిషన్లో పనికిపోయిందు. మీరు పుట్టక ముందు మదనపల్లెలో కొన్నాళ్లు కోతమిషన్లో డ్రైవరుగా పనిచేసినా. ఈపాటికి మనం గూడా టౌనులో సొంత ఇల్లు కట్టుకోన్నిందుము. ఇప్పుడు ఈ ముసలి మోపన ఆడికిపోయి ఏం పనిచేసి బతకతాము,'' అన్నాడు ఆచారి దిగులుగా.

తండ్రి ఎంతగా మాట్లాడుతున్నా సురేంద్ర వులుకూ పలుకూ లేకుండా నడుస్తున్నాడు.

కొడుకు మౌనం ఆచారి మాటలకు అంత రాయం కలిగించింది. అంతవరకు తన గురించి ఆలో చిస్తున్నాడేగాని కొడుకు గురించి ఆలోచించలేదు. కొడు కంత మౌనంగా ఎందుకున్నాడో ఆచారికి స్పష్టంగానే అర్థమయింది. ఆచారికి ఒక కొడుకు, కూతురు. కొడుకు కన్నా కూతురు చాలా పెద్దది. ఆమెకెప్పుడో పెళ్లయి పోయింది. ఆచారి తన ఆశలన్నీ కొడుకు మీదే పెంచు కున్నాడు. చదువు రానందుకే తను ఇన్ని ఇబ్బందులు పడుతున్నాడని, అలాంటి ఇబ్బందులు పడకుండా ఉండడం కోసం కొడుకును బాగా చదివించాలను కున్నాడు. తిండికే కనా కష్టంగా ఉంటే కొడుకును ఎలా చదివించగలడు? సురేంద్రను ట్యూషన్లు పంప నందుకో, తను చేరిన కాలేజీలో లెక్చరర్లు లేనందుకో, లేక తమకు అదృష్టం లేనందుకో తెలీదుగాని సురేంద్ర ఇంటరు ఫెయిలయినాడు.

ఆరోజు రిజల్టు పేపరులో తన నెంబరు లేకపో వడంతో సురేంద్ర ఇంట్లో మూలన కూర్చొని భోరున ఏడవసాగినాడు. ఆచారి కొడుకును సమీపించి-

''ఎందుకురా ఏడుస్తావు. ఫెయిలయితే మళ్లీ బతుకే లేదా? మన రెక్కలుండాయి, మన పనుండాది. మీ తాతల కాలం నుంచి బతకడంలే మేము. నువ్వా అంతే. రేపట్నుంచి పనికి పోదాంపద. చదివినా ఉద్యో గాలు రావు. ఉద్యోగం వచ్చినా ఒగనికి వంగి సలాం చెయ్యాల్సిందే గదా! అదే మన చేతిపని అయితే పెద్ద పెద్ద ఆఫీసర్లంతా మన దగ్గరికి వస్తారు. రెక్కల్లో సత్తువ ఉన్నెంతకాలం తిండికి గుడ్డకు లోటుండదులే,'' అన్నాడు.

అది మొదలు సురేంద్ర తండ్రి వెంట పనికి పోసాగినాడు. సురేంద్ర తమ కులవృత్తిలో అడుగు పెట్టిన వేళావిశేషమో ఏమో మరి అతని వెనకే ట్రాక్టరు ఊరులోకి వచ్చింది. రైతునూ, ఆచారినీ విడదీసింది. సురేంద్రకు చాలావరకు బతుకుతెరువు లేకుండా చేసింది. అదంతా ఆచారికి గుర్తురావడంతో కొడుకు కన్నా ఎక్కువగా బాధపడ్డాడతను. తను కూడా కొంత సేపు కొడుకు వెంట మౌనంగా నడిచాడు. కష్టాలతో పండిపోయిన అతని మనసు ప్రస్తుతం ఎంతటి కష్ట మయినా అలవోకగా తీసుకోవడానికి అలవాటు పడింది. అందువలన కొంతసేపటికే తేరుకొని,

''రోజులు ఎప్పుడూ ఇట్లే ఉండవులే. మన ముత్తాతల కాలంలో రంపాలు లేవంట. బాడిశలతో చెక్కి దాలమంద్రాలు తయారుచేస్తాన్నేరంట. రంపా లొచ్చాలకు చెక్కేవోళ్లకు బతుకుతెరువు లేకుండా పాయనా? లేదే! నారు పోసినోడు నీరు పోస్తాడు. మనం దిగులుపడాల్సిన పనిలేదు. ఏదో ఒగ పని ఆ భగమం తుడు చూపిస్తాడు. అంతదాకా ఎసనపడకుండా ధైర్నం గా ఉండాల,'' అన్నాడు ఆచారి కొడుక్కు గీతోపదేశం చేస్తున్నట్లుగా.

ఆ మాటలకు కూడా సురేంద్ర పెదవి విప్పలేదు.

''ఇంతకు ముందంతా మేమే 'తోపుడు' తోస్తాం టిమి. ఇప్పుడు మిషన్లొచ్చాలకు ఒగవారం పట్టేపని ఒగ రోజులో అయిపోతాండాది. అంతమాత్రాన ఏ ఆచారి గానీ పనిలేదని ఈదిన పడలేదే. ఎవరి బతుకువాళ్లు బతుక్కొంటాండారు. కాకపోతే కష్టాలు కొన్నాళ్లుం టాయి. బయపడకుండా దైర్నంగా ఉన్నేమంటే బతక తాము. లేకుంటేనా... ఈ భూమ్మీద ఒగ నెల కూడా ఉన్నిందము,'' అన్నాడు ఆచారి కొడుక్కు ధైర్యం చెబుతున్నట్లుగా.

ఆచారి మాట్లాడుతూనే ఉన్నాడుగానీ సురేంద్ర తనకు సంబంధం లేదన్నట్లుగా మౌనంగా నడవ సాగాడు. ''ఆ బేగు ఇట్లీ,'' అన్నాడు ఆచారి.

''తెస్తాలే,'' అన్నాడు సురేంద్ర చాలాసేపటి తర్వాత.

''దాంట్లో అన్నంమూట ఉండ్లా. పోనుపోను బరు వెక్కుతాది. నేను తెస్తానీ,'' అంటూ కొడుకు చేతిలోంచి బలవంతంగా తీసుకొన్నాడు.

"పని బాయికాడనా, ఇంటికాన్నా నాయనా."

"బాయికాడే. ఇంతకుముందు మీ అమ్మా నేనూ తీర్లు కోసినప్పుడు కానిగమాని కింద గుంత తొగించి నారు. ఇప్పుడా గుంత అట్లే ఉంటాది. కొంచెం పూడిం టాదేమో. గుంత లేకపోతే మేము కొయ్యమంటాలే. వాళ్లే మన్ను తీస్తారు. చానా తుండ్లుండాయి. అయ్యన్నీ కొయ్యాల గదా," అన్నాడు ఆచారి ఉత్సాహంగా.

"నీడుందా?"

"పెద్ద తోపుండాది. బాయికి ఆనుకొనే ఒక పెద్ద ఏపమానుండాది. ఆ మాను కింద గుంత, చల్లగా ఉంటాదాడ."

ఇద్దరూ మాటల్లో మునిగిపోయి చకచకా నడవ సాగినారు.

"ఆ... వచ్చేసినాం. అదో ఏపమాన్ల గుంపుండాదే అదే మనం పని చేయాల్సిన తావు," అన్నాడు ఆచారి.

ఇద్దరి నడకలో వేగం పెరిగింది. కొంతసేపట్లో అక్కడికి చేరగానే ఆచారి ఆశ్చర్యంగా అటూఇటూ చూడసాగినాడు. సురేంద్రకు అనుమానం వచ్చింది.

"వాళ్ల బాయి ఈన్నేనా నాయనా," అడిగాడు తండ్రిని.

"ఈన్నే... ఆ ఏపమాన్లకు ఆనుకొనే కొంచెం ఎడంగా పెద్ద ఏపమాను ఉన్నింది. దాని పక్కన్నే బాయి. నాకు బాగా గుర్తే," అన్నాడు ఆచారి మెల్లగా.

'ఉంటే ఏమీ,' అన్నట్లుగా చూశాడు సురేంద్ర.

రంపం, బాడిశ, చేతిసంచిని తీసి ఒక చెట్టునీడన పెట్టారు.

"ఏం ఆచారన్నా... చానా రోజులకు కన్పిస్తాం డావే."

"రెడ్డెప్పా... మీ పనికనే వచ్చినాం అన్నలేడా?" అన్నాడు ఆచారి.

"నిన్న ఊరికి పోతాన్నిట్లు ఉండె. వచ్చినాడో లేదో తెల్లేదే."

"మీరంతా ఉండేది ఒకే తావన్నే గదా," మెల్లగా అడిగాడు ఆచారి.

"ఒగతావన యాడుండాము. పాతింట్లో మా అన్నుండాడు. పాతిల్లు ఊరికాపక్కగదా ఉండాది. ఊరికి ఈ పక్కన ఇంగో ఇల్లు కట్టుకొని ఆడ చేరిపోయి నాం. మేము ఏరుబాగాలు పోయి చానా ఏండ్లాయనే."

"అవునా... నాకు తెలీదులే. ఈడొగ ఏపమాను, బాయి ఉండాల గదా."

"ఇంగా యాడ ఏపమాను, బాయి. అయ్యి రెండూ నా భాగానికి వచ్చె. ఇల్లు కడతాంటిమి. దాల మంద్రం తీర్లు, తలుపు చెక్కలు అవసరం గదా. మాను కోపించేస్తి. బాయి ఎప్పుడో ఎండిపొయ్యింది. బోరు గూడా ఆ పక్కన ఏసిండాము. అదో... చూడు... ఆడ మిరపతోట ఉండాదే అదే బాయి. బాయిని పూడ్చే సినాం" అన్నాడతను సిగరెట్ ముట్టిస్తూ.

తను ఇంతకుముందు పని చేసినప్పుడు ఉమ్మడి కుటుంబం రెడ్డెప్ప వాళ్లది. అప్పుడితను సిగరెట్ తాగే వాడు కాదు. మనుషులు ఎంతగా మారిపోతాండారు అనుకొన్నాడు ఆచారి. "మాకు చెప్పలేదే ఏప మాను కోసేదానికి. తీర్లు పలకలు ఎవరు కోసిచ్చిరి?" అడిగాడు ఆచారి.

'ఎంత అమాయకమయిన ప్రశ్న వేసినావు ఆచారి' అన్నట్లుగా చూసి, "ఊర్లో ట్రాక్టరుండాది. కలకడలో కోతమిషనుండాది. ఇంగ దిగులెందుకు?"

ఆ మాటలు వింటూనే తండ్రీకొడుకుల మనసు విలవిలలాడింది.

"పోతే పోనీలే. నువ్వు పని చెప్పకుంటే పొయ్యి నావు. మీ అన్న మాత్రం అన్నీ అట్లే పెట్టినాడంట గదా! నిన్న బస్సులోంచి అరిసి చెప్పె. అందుకే ఈ పొద్దు వచ్చినాం."

"మా అన్నయి మాత్రం యాడుండాయి. యిద్దరం ఒగసారేగదా ట్రాక్టర్లో ఏసుకొనిపోయింది," అన్నాడతను.

"ఏసుకోని పొయ్యినారా!? అయితే మమ్మల్నెం దుకు రమ్మనింది?" అన్నాడు కోపంగాను, ఆశ్చర్యం గాను ఆచారి.

అంతవరకు నిల్చుకొని వాళ్ల మాటలు వింటున్న సురేంద్ర, చివరి మాటలతో అతని మనసు వికలం కావడంతో సామాన్ల పక్కన మౌనంగా కూర్చొన్నాడు.

"ఇంగా ఏమన్నా ఉండాయేమో ఇంటికాడికి పోండి. నేను మడికి నీళ్లుపట్టాల. మళ్లా కరెంటు పోతాది," అంటూ వెళ్లిపోయాడతను.

"లెయ్ నాయనా పోదాము," అన్నాడు ఆచారి కొడుకుతో.

"యాడికి?"

"ఇప్పుడు మాట్లాడినాడే, వాళ్లన్న పెద్దరెడ్డెప్ప ఇంటికి"

"ఎందుకు...? తుండ్లు లేవంట గదా. గమ్మున ఇంటికిపోదాం పదా"

"తుండ్లు లేందే ఊరికే చెప్పే మనిషి గాదాయన. ఇంటికాడ తప్పకుండా ఉంటాయి. పోదాం పదా,"

అంటూ రంపం ఎత్తి భుజం మీద పెట్టుకొని, చేతి సంచిని తీసుకొన్నేడు. ఇక తప్పదన్నట్లుగా సురేంద్ర కూడా బాడిశ ఎత్తుకొని తండ్రి వెంట బయల్దేరినాడు. పది నిముషాలకంతా వాళ్ల ఇల్లు చేరుకొన్నారు. పెద్ద రెడ్డెప్ప ఇంటి దగ్గరే ఉన్నాడు.

"వచ్చినావా ఆచారి. వస్తావో రావో అనుకొం టాంటి. ఇంటెనక్కుపాండి. ఆడుండాయి తుండ్లు," అన్నాడతను.

అందరూ అక్కడికి వెళ్లారు. తొడలావుతో ఆరడు గుల పొడవుతో ఉండే నాలుగు తుమ్మ తుండ్లు చూపిం చాడతను.

"మిగిలిన కొయ్యలన్నీ...?" అన్నాడు ఆచారి మెల్లగా.

"అయ్యన్నీ కలకడలో కోపించేస్తి. ఇయ్యి కూడా కోపించేద్దు. తుమ్మయి కదా... పర్మిట్ తీసుకోవాలంట. పర్మిట్ లేకపోతే కేసు. పదిరవైవేలు అపరాధం ఏస్తారు. ఎందుకొచ్చిన బాధలే, నువ్వుండావు కదా. కోపిద్దాం అనుకొంటి," అన్నాడతను నవ్వుతూ.

అతని నవ్వు సురేంద్రకు కంపరంగా ఉంది. ఆచారి కొంతసేపు ఏమీ మాట్లాడలేకపోయినాడు. తన కెన్నో ఆశాభంగాలు అనుభవంలో ఉన్నా, ఈ ఆశా భంగం మాత్రం అతడ్ని చాలా కదిలించేసింది. అడవి లోకిపోయి చావడమో, టౌనులోకి పోయి మన్ను మోయడమో చేయాల తప్ప ఇంక ఈ పని మాత్రం చేయకూడదనుకొన్నాడు. ఆవేశంలో అలా అన్పించింది కాని, ఆలోచిస్తే ఇన్నేళ్లు తనకు జీవనాధారం కల్పించిన ఆ వృత్తిని అంత సులభంగా వదులుకోలేననిపించింది. మళ్లీ తమకు మంచిరోజులు వస్తాయి అనుకొన్నాడు.

"ఏమాచారి గమ్మునయిపోతివే?"

"ఆఁ... ఏంలేదు ఏంలేదు... కోస్తాం," అన్నాడు తడబాటుగా.

"దాలమందం తీర్లకు కోసేయండి. మద్దేనాలకు అయిపోతాదా?"

"ఇదేమన్నా సంగటా... బిన్నే అయిపోయేదానికి, సందేళ దాంకా పడతాది,"

"ఎందుకబ్బా అంతసేపు... సందేడు లావు కూడా లేవే...?! అబ్బులిచ్చి పట్టుకొనేంత లావు తుండ్లు కూడా మిషనులో అయితే అరగంటలో కోసి పారేస్తారు. అట్లా డిది ఒక తుండు కొయ్యాలన్నా మీకు పదిరవై రోజులు పడతాదేమో... సరేలే... మాటలు పెట్టుకొంటే పనికాదు. నేను పింఛాదాకా పోయొస్తా. ఏమన్నా కావాలంటే ఇంట్లో అడగండి... అన్నం తినేసి వచ్చినారా?"

"తిన్నేము... మద్దేన్నేనికి తెచ్చుకొన్నేం..."

"ఏంబా ఆచారి... మా ఇండ్లల్లో తింటే గొంతు పట్టుకొంటాదా. రెండు మైళ్ల దూరం అన్నం మూటను మోసుకోని రాకుంటేనేమి!" అన్నాడు పెద్ద రెడ్డెప్ప నవ్వుతూ.

"మా తాతల కాలం నుంచి వస్తాండే అలవాటు. పస్తయినా ఉంటాంగాని పరాయి కులమోల్ల ఇండ్లల్లో నీళ్లుగూడా తాగము. నేను బతికుండంగా అంతే ఇంగ."

"ఏమోబ్బా మీ ఇష్టం... తినేటిగా ఉంటే లక్ష ణంగా చేసి పెట్టమంటా. తినరులే. ఇంతకు ముందు తినలేదుగదా. సందేళ బత్తెం తీసుకోని పోదురులే. మీ కొడుకేమి గమ్మున కుచ్చోనుండాడే. వంట్లో బాగలేదా? ఏం పేరు నీ పేరు?" అన్నాడు సురేంద్రనుద్దేశించి.

"సురేంద్ర," అన్నాడు ముక్తసరిగా.

"సరే సరే. ఆచారి మీరు పనిచేయండి. నాకు బస్సు తప్పోతాది. పోయొస్తా," అంటూ పెద్ద రెడ్డెప్ప అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

"లెయ్ సురేంద్రా. సందేళకు కోసేసి పోదాం. మళ్లా రేపు యాడ వచ్చేది."

"ఈ పని చెయ్యకుంటేనేమి?"

"అట్లనుకొంటె ఎట్లా... ఒగోసారి పెద్ద పననుకోని పోతే చిన్న పనుంటాది. ఇంగోసారి చిన్న పననుకోని పోతే పెద్ద పనుంటాది. అదంతా మన టైము. లేసి ఇంట్లో అడిగి దబర, గ్లాసు, ప్లేటు తీసుకొని బోరింగుకాడికి పొయ్యి, బాగా కడుక్కొని నీళ్లు పట్టుకొని రాపో," అన్నాడు కొడుకుతో ఆచారి.

సురేంద్ర అయిష్టంగానే అక్కడి నుంచి లేచి వెళ్లాడు. అతను వచ్చే లోపల ఆచారి, మోకుతాడు తీసుకొని గొడ్లకొట్టంలో రెండు కూసాలకు, రెండు మోర లెత్తులో అడ్డంగా ఒక కొయ్యను కట్టాడు. బొగ్గులు కొన్ని తీసుకొనొచ్చినాడు. పాతకుండది అడుగు పెంకులో నీళ్లు కొన్ని పోసి బొగ్గులను సాదినాడు. మరికొంత సేపటికి సురేంద్ర వచ్చినాడు.

"యాడికిపోతే అన్నేనా? బాడిశ ఎత్తుకో... తుండ్లు చెక్కు. దారం తడదాము" అన్నాడు ఆచారి కొడుకుతో.

"నీరసంగా ఉండాది నాయనా. బోరింగు కొట్టే దానికి నానింటికాలా. నువ్వే చెక్కు," అన్నాడు కుచ్చుంటు.

కొడుకు పనిలోకి వచ్చిన సంవత్సరం తరువాత నుంచి ఆచారి పెద్ద బాడిశ పట్టడం మానేసినాడు. సురేంద్ర పెద్ద బాడిశ పనిలో మంచి పనోడు. చెక్కినా డంటే తోపడ తోసినంత శుద్ధంగా ఉంటాది. ఐద

డుగుల పొడవు కట్టి బాడిశను పైకి లేపి ఇడిసినాడంటే ఎక్కడ పడాల్నో అక్కడే పడుతుంది. ఆచారి తాత బాడిశ పనిలో పెద్ద పనిమంతుడు. అతడు ఆ రోజుల్లో 'అణా'ను ఒక పక్క ఎడంకాలి బొటనవేలితో తొక్కిని రెండు భాగా లయ్యేటిగా చెక్కేవాడట. ఆ మాదిర్తో చెక్కే వాళ్లు ఎక్కడా లేరని అందరూ చెప్పుకొంటా ఉంటారు. తన కొడుకు కూడా ఐదుపైసలను బొటనవేలితో తొక్కి పట్టుకొని, బాడిశను అలాగ్గా పైకెత్తి వేసేవాడు. సురేంద్ర బాడిశతో చెక్కుతా ఉంటే ఆచారి తదేకంగా చూసే వాడు. ఆచారి రోజుకు ఐదు లేక ఆరు మడకలేస్తాడంతే. అదే సురేంద్ర రోజుకు పది మడకలు ఏస్తాడు. తనకు గొప్ప పనిమంతుడైన కొడుకు పుట్టినాడని సురేంద్రను చూస్తే ఆచారికి చాలా సంతోషం. ప్రస్తుతం అక్కడ పని చెయ్యడం సురేంద్రకు ఇష్టం లేదు. అందుకే కళ్లు తిరగ తాండాయి అంటాండాడు అనుకొని తనే బాడిశ చేతికి తీసుకొన్నాడు.

ఎడమచేతిని కట్టి చివర పట్టుకొని, కుడిచేతిని మధ్యలో పట్టుకొని బాడిశను పైకి లేపి వేసినాడు. ఆచారికి బలం చాలడంలేదు. వృద్ధాప్యం, సరైన తిండి లేకపోవడంతో చేతులు వణకసాగాయి. కొంతసేపు తండ్రి అవస్థను చూస్తూ కూర్చొన్నాడు. ఎక్కడ కాలు మింద వేసుకొంటాడోనని తండ్రిని కుచ్చోమని తను చెక్కడం ప్రారంభించాడు. చెక్కడం పూర్తవుతూనే దారాన్ని పెంకులోని బొగ్గునీళ్లలో తడిపి కొయ్యలపైన గీతలు వేసినారు.

"ఈడ కోసేది వద్దు నాయనా. కంపుగదా. ఇంటె నకాల చింత చెట్టుండాది గదా. ఆడ రెండు గుంజలు నాటి కోద్దాం," అంటూ తండ్రి సమాధానం కోసం ఎదురుచూడకుండా చకచకా వెళ్లి గడ్డపార తీసుకొని రెండు గుంతలు తవ్వి గుంజలు నాటినాడు. అడ్డంగా మరో కొయ్య కట్టినాడు. ఆ కొయ్యకు కొయ్యాల్సిన తుండును ఆనించినాడు.

"ఆకలిగా ఉండాది. తినేసి కోద్దాం," అన్నాడు ఆచారి.

ఇంట్లో అడిగి రెండు విస్తరాకులు తెచ్చినాడు సురేంద్ర. ఆచారి టవలు తీసి కింద పరిచినాడు. అన్నం మూటను ఎడంచేత్తో పట్టుకొని, కుడిచేత్తో నీళ్లు తీసు కొని అన్నం ఉన్నంతమేరా గుడ్డను తడిపినాడు. తరు వాత దాన్ని టవలు మీద ఉంచి ముడి విప్పినాడు. తడి చేయడం వలన గుడ్డకు అంటుకోనుండే అన్నం అంతా కూడా ఊడివచ్చింది. ఇద్దరూ అన్నం తినడం పూర్తవు తూనే సురేంద్ర అన్నంగుడ్డను నీళ్లలో పులిమి, పిండి, పక్కనే ఉండే కంచెపైన ఆరేసినాడు. ఆలస్యం చేస్తే పనయిపోదని వెంటనే పనిలోకి దిగేసినారు. తండ్రి ఒకవైపు, కొడుకు మరొకవైపు ఉండి రంపంతో కొయ్య లను కోయసాగినారు. సాయంకాలం ఆరుగంటల కంతా పనయిపోయింది. అప్పటికి పెద్ద రెడ్డెప్ప కూడా పించాకు పొయ్యి వచ్చేసినాడు.

"ఎంతయిందో చెప్పు ఆచారి," అన్నాడతను.

"ఒగోటి ఆరడుగులుండాది. నాలుగు తీర్లు. అంటే ఇరవై నాలుగడుగులు. అడుక్కు నాలుగు రూపాయిలీ," అన్నాడు.

"అడుక్కు నాలుగా. ఎందుకంత. రెండు రూపా యలిస్తా తీసుకో."

"రెండు రూపాయలా... పదేండ్లకు ముందు మాట గదప్పా అది."

"అందుకనే రెండు రూపాయలిస్తాండా. మిషన్లో ఎంతనో తెలుసా. అడుక్కు అర్ధరూపాయి. మీ వాడికి ఒకటిన్నర రూపాయి ఎక్కువే ఇస్తాండా కదా."

"ఇద్దరం మనుషులం వచ్చినాం. సందేళదాంకా పనిచేసినాం. కూలికి పొయ్యినా రోజుకు ఇద్దరికి ఎనభై రూపాయలొస్తాది. నువ్వేంది. ఇంత అద్వాన్నంగా చెప్తావే. దానికన్నా దుడ్డే వద్దులే," అన్నాడు ఆచారి నిష్ఠూరంగా.

"అంత కోపమయితే ఎట్ల ఆచారి. కూలికి పోవా లన్నే పనులేడ ఉండాయి. ఉన్నే మీరు కూలికి పోతారా? కరువు కాలంలో మీకు పని ఇచ్చిందే గొప్ప," అన్నాడు పెద్ద రెడ్డెప్ప.

"ఇట్లా పని చేసేదానికన్నా గమ్మునుండేది మేలు గదా," అన్నాడు ఆచారి. ఎందుకు ఈ పని చేసినామా అనుకొంటున్నాడు. కొడుకు మాటవిని కొయ్యకుండా వెళ్లిపోయిన్నే బాగుండునే అనుకొంటా ఉండాడు.

"వయసెక్కువయ్యాలకు కోపంకూడా ఎక్కు వవుతాండాదే ఆచారి. అంతగా కోపగిచ్చుకుంటే ఎట్ల. మూడు రూపాయలెక్కన ఇస్తాలే. తీసుకో. ఇంగేం మాట్లాడద్దు. ఇందా ఈ యాభై పెట్టుకో... మిగతా చిల్లర సంతనాడు కనిపించు ఇస్తా," అన్నాడు పెద్ద రెడ్డెప్ప.

"దీంట్లో మల్లా కొదవా? సంతనాడు నువ్వేడ వుంటావో? ఇచ్చెయ్యప్పా మొత్తం. మేం పనిచేసి రెండు నెలలయితాండాది. ఇంట్లో చానా కష్టంగా ఉండాది," అన్నాడు ఆచారి యాభై తీసుకొని జేబులో పెట్టు కొంటూ.

"లేదు ఆచారి. పింఛాకు పోయ్యింది దుడ్డు కోసరమే. ఆడ రావాల. ఆ మనిషి రేపొరం వాయిదా ఏసె. ఆడ ఇచ్చింటే ఇంగా యాభై కావాలన్నే ఇచ్చిండు. దుడ్డొచ్చినాంక కనపడు. నూర్రూపాయలు ఇస్తా. ఏదన్నా పనిచేసి చెల్లబెడుదువులే," అన్నాడతను.

ఆచారి ఇంకేం మాట్లాడలేకపోయాడు. అతని జేబులో వందరూపాయల కాగితాలు కనపడుతున్నాయి. నిజంగా డబ్బు లేక లేదనే వాళ్లను ప్రాధేయపడినా, ఎక్కడో ఒకచోట తీసుకొచ్చి అయినా ఇస్తారు. డబ్బు ఉండీ లేదనే వాళ్లను ఎంతగా అడిగినా వృథానే అని ఆచారికి తెలుసు. కొడుకు కోసరం అటూ ఇటూ చూశాడు.

"సురేంద్రా..." అంటూ పిలిచాడు.

"ఆ..." అంటూ పలికాడు సురేంద్ర.

"మీ కొడుకు నేను వచ్చినప్పటి నుండి అక్కడ ఏందో తారాడతాండాడు," అన్నాడు పెద్ద రెడ్డెప్ప. ఆచారి కొడుకు దగ్గరకు వెళ్లాడు. పెద్ద రెడ్డెప్ప అతన్ని అనుసరించాడు. సురేంద్ర ముఖం చాలా ఆందోళనగా ఉంది.

"ఏంది తారాడతాండావే," అడిగాడు ఆచారి.

"అన్నంగుడ్డ నాయనా. ఈన్నే ఆరేసిన్నే... కనపల్లేదు," అన్నాడు సురేంద్ర. అతని మాటల్లో కూడా ఆందోళన ధ్వనిస్తోంది.

ఆచారి కూడా వెతకసాగాడు.

"అన్నంగుడ్డా..." అడిగాడు పెద్ద రెడ్డెప్ప.

"అవున్నా... మద్యాన్నం అన్నం తిని ఈన్నే ఆరేసినాం," అన్నాడు సురేంద్ర.

"అది పాతగుడ్డే కదా! క్యారేజీ కొనుక్కోకూడదా. గుడ్డపోతే పోయిందిలే. మబ్బాయి పోతాండాది. రెండు మైళ్ల పైన నడద్దా. ఎలబారండి," అన్నాడు పెద్ద రెడ్డెప్ప నవ్వుతూ. పాతగుడ్డ కోసం వెతకడం అతనికి నవ్వులాటగా ఉండాది.

అరగంట ముందు వచ్చిపోయిన చిట్లాగాలిలో గింగిరాలు తిరుగుతూ అన్నంగుడ్డ వెళ్లిపోవడం వాళ్లెవరూ చూడలేదు.

ఆ అన్నంగుడ్డే తమ జీవిత సర్వస్వమన్నట్లుగా, అక్కడే ఎక్కడో ఉంటుందని తండ్రీ కొడుకులు, అన్నంగుడ్డ కోసం వెతుకుతూనే ఉన్నారు...!

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 27 అక్టోబర్ 2002*

